## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 86 సోమవారం జూలై 27 2026, పేజీలు - 4 వెల :2/-




## జై జవాన్ - జై కిసాన్ - జై యువ

## యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలి

### పోటీ వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన

హిందుస్థాన్ మీడియా

దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి "జై జవాన్ – జై కిసాన్ – జై యువ" అనే నూతన నినాదాన్ని ప్రతిపాదించారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో జాతీయ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడిన సీఎం, ప్రపంచవ్యాప్తంగా యువత వివిధ రంగాల్లో నాయకత్వాన్ని ప్రదర్శిస్తోందని, అదే అవకాశాన్ని రాజకీయ వ్యవస్థలో కూడా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువత ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సేవల్లో, స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులుగా, ప్రపంచ స్థాయి సంస్థల్లో నాయకులుగా రాణిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల సీబీఎస్ఈ, నీట్, నెట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం, విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించి, నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ వయస్సును 21 ఏళ్లకు నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే వయస్సును 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ కోసం ఆగస్టులో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు సేకరించిన అనంతరం అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపును కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాల్సిందే: తెలంగాణ బీజేపీ డిమాండ్

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వారంలోగా చెల్లించాలని సీఎం రేవంత్‌కు బీజేపీ అల్టిమేటం**

**లేదంటే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాంచందర్ రావు డిమాండ్**

**నీట్ వివాదంలో యువతను రెచ్చగొట్టి ప్రధాని మోదీని బలహీనపరిచేందుకు కుట్ర జరిగిందని ఆరోపణ**

**తెలంగాణలో పేపర్ లీక్‌లపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎందుకు మౌనంగా ఉన్నాయన్న డీకే అరుణ**

హిందుస్థాన్ మీడియా

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వ్యవహారం పై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.12,000 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం, మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ ఇక్కడ ర్యాలీ తీసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మరోవైపు, బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా ఈ విషయంపై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఓ వ్యక్తి యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని ఆమె ఆరోపించారు.



## పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని మోదీ సంచలన నిర్ణయం.. మరో వీడియో రిలీజ్!

హిందుస్థాన్ మీడియా

పేపర్‌లీక్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ మరో వీడియో రిలీజ్ చేశారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు ప్రముఖ సాంకేతిక నిపుణుడు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిలీజ్ చేసిన వీడియో పేర్కొన్నారు..పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని మోదీ సంచలన నిర్ణయం.. మరో వీడియో రిలీజ్! పేపర్‌లీక్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ మరో వీడియో రిలీజ్ చేశారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు ప్రముఖ సాంకేతిక నిపుణుడు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిలీజ్ చేసిన వీడియో పేర్కొన్నారు..విద్యార్థుల భవిష్యత్తు, పేపర్ లీకేజీల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పోటీ పరీక్షల్లో పారదర్శకత పెంపు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక నిర్ణయం ప్రకటించారు. నందన్ నిలేకని ఆధ్వర్యంలో హైపవర్డ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేలా సమగ్ర సంస్కరణలు చేపట్టనున్నట్లు ప్రధాని తెలిపారు.

## త్వరలో ఆర్‌బీఐ కొత్త 'ప్లాస్టిక్ నోట్లు'.. కాగితం నోట్లలా మడతబెట్టొచ్చా? మీ అతిపెద్ద డౌట్‌కు క్లారిటీ..!

హిందుస్థాన్ మీడియా

పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లు సాధారణ కాగితపు నోట్ల కంటే కొద్దిగా భిన్నంగా ఉంటాయి. అందువల్ల, ప్రస్తుత నోట్ల లెక్కింపు యంత్రాలు, నగదు నిర్వహణ యంత్రాలు, ఏటీఎంలను కూడా అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. పాలిమర్ నోట్లు ప్లాస్టిక్‌లా కనిపించినప్పటికీ, అవి డెబిట్, క్రెడిట్ కార్డులంత బలంగా ఉండవుభారత కరెన్సీలో ఒక పెద్ద మార్పు రాబోతోంది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాగితపు నోట్ల స్థానంలో ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలనే తన ప్రణాళికను ప్రకటించింది. ఇందుకోసం ఇప్పటికే టెండర్లను పిలిచారు. ఈ కొత్త ప్లాస్టిక్ నోట్ల గురించి సామాన్య ప్రజల మదిలో అనేక ప్రశ్నలు మెదులుతున్నాయి. ఇవి ప్లాస్టిక్ నోట్లు కాబట్టి, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల వలె దృఢంగా ఉంటాయా? ప్లాస్టిక్ నోట్లను మడవవచ్చా?రిజర్వ్ బ్యాంక్ ప్రస్తుతానికి పైలట్ ప్రాజెక్ట్‌గా రూ.10, రూ.20 నోట్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నోట్లకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తే, మిగిలిన నోట్లను కూడా ప్లాస్టిక్ నోట్లుగా మార్చడం జరుగుతుంది. ఈ ప్లాస్టిక్ నోట్లు చాలా మన్నికగా ఉంటాయని ఆర్‌బిఐ తెలిపింది. వాటి చెల్లుబాటు కాలం కూడా చాలా ఎక్కువ ఉంటుంది. ప్లాస్టిక్ నోట్లపై తలెత్తిన ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు లభించాయి

### ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను మడవవచ్చా?

పాలిమర్ నోట్లు ప్లాస్టిక్‌లా కనిపించినప్పటికీ, అవి డెబిట్, క్రెడిట్ కార్డులంత బలంగా ఉండవు. ఈ నోట్లు చాలా పలుచగా ఉంటాయి. ఫలితంగా ఈ నోట్లను మడవడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం కాగితపు నోట్లను డబ్బు సంచులలో లేదా జేబులలో ఎలాగైతే ఉంచుకుంటారో, అలాగే ప్లాస్టిక్ నోట్లను కూడా మడవవచ్చు. కాగితపు నోట్లకు, ప్లాస్టిక్ నోట్లకు మధ్య ఉండే అతిపెద్ద తేడా ఏమిటంటే, ప్లాస్టిక్ నోట్లను మడిచినప్పుడు వాటిపై ఎలాంటి గుర్తులు పడవు. మడత నుండి నోటును విప్పినప్పుడు, అది ముందులాగే ఉంటుంది.

### నోట్ల లెక్కింపు యంత్రాన్ని కూడా మార్చాలా?

పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లు సాధారణ కాగితపు నోట్ల కంటే కొద్దిగా భిన్నంగా ఉంటాయి. అందువల్ల, ప్రస్తుత నోట్ల లెక్కింపు యంత్రాలు, నగదు నిర్వహణ యంత్రాలు, ఏటీఎంలను కూడా అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? ఈ నోట్లు కాగితపు నోట్ల కంటే చాలా మన్నికైనవి. పాలిమర్ కరెన్సీ నోట్లు సాపేక్షంగా తక్కువ మురికిగా ఉంటాయి. ఇది తడిసినా పాడవదు. లాగడం వల్ల చిరిగిపోయే ప్రమాదం తక్కువ. ఈ నోటును నకిలీ చేసే అవకాశం తక్కువ



## పోలీసుల కళ్లుగప్పి పరారైన ఖైదీ అరెస్ట్

**-నిజామాబాద్‌లో చాకచక్యంగా పట్టుకున్న సిద్దిపేట పోలీసులు**

హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:



సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పోలీసుల కళ్లుగప్పి పరారైన ఖైదీ జొన్నల సాయి కుమార్ను సిద్దిపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిజామాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఖైదీ పరారైన ఘటన సంచలనం రేపగా, 24 గంటలు గడవకముందే పోలీసులు అతడిని పట్టుకోవడం విశేషం. పోలీసుల వివరాల ప్రకారం, అనారోగ్యంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చిన సాయి కుమార్, భద్రతా సిబ్బంది అప్రమత్తత లోపాన్ని ఆసరాగా చేసుకుని పోలీసుల నిఘా నుంచి తప్పించుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక గాలింపు బృందాలను ఏర్పాటు చేసింది. దర్యాప్తులో భాగంగా ఖైదీ నిజామాబాద్ వైపు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సిద్దిపేట పోలీసులు, నిజామాబాద్ పోలీసుల సహకారంతో సంయుక్తంగా గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలు, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని విశ్లేషించి అతడు తలదాచుకున్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందం నిజామాబాద్‌లో సాయి కుమార్‌ను అదుపులోకి తీసుకుని తిరిగి సిద్దిపేటకు తరలించింది. ఖైదీని అత్యంత వేగంగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పోలీసు బృందాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

## రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టం: ఎమ్మెల్యే పల్లా



హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి (మల్లన్న) పేరుతో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ ప్రారంభం కావడం నియోజకవర్గ ప్రజలకు, కోట్లాది మంది మల్లన్న భక్తులకు చారిత్రాత్మక ఘట్టమని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మనోహరాబాద్--కొత్తపల్లి రైల్వే మార్గంలో భాగంగా నిర్మించిన ఈ స్టేషన్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట, కొమురవెల్లి, సిరిసిల్ల ప్రాంతాలకు మెరుగైన రైల్వే అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఈ రైల్వే మార్గం ప్రాంతీయ అభివృద్ధికి, రవాణా రంగ విస్తరణకు కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 నిధుల భాగస్వామ్యంతో ప్రారంభమైందని, అప్పట్లో భూసేకరణను ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా పూర్తి చేయడం వల్లే నేడు ఈ ప్రాజెక్టు సాకారమైందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే మల్లన్న జాతర సమయంలో లక్షలాది మంది భక్తుల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టు సాకారం కావడానికి దూరదృష్టితో కృషి చేసిన నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి, అలాగే ప్రాజెక్టు పూర్తి చేయడంలో భాగస్వామ్యమైన కేంద్ర రైల్వే శాఖకు ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## తొలి ఏకాదశి వేడుకలతో దేవాదాయ శాఖకు భారీ ఆదాయం

**-గతేడాదితో పోలిస్తే రూ.2.98 లక్షల పెరుగుదల**

హిందుస్థాన్ మీడియా, వినుకొండ(AP):



తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ పట్టణ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన తిరునాళ్ల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, దేవాదాయ శాఖకు గణనీయమైన ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ అధికారుల వివరాల ప్రకారం, హుండీ ఆదాయం, వేలం పాటలు, భక్తుల విరాళాల ద్వారా మొత్తం రూ.9,87,584 ఆదాయం లభించింది. గత ఏడాది తొలి ఏకాదశి సందర్భంగా వచ్చిన ఆదాయంతో పోల్చితే ఈ ఏడాది రూ.2,98,602 అదనపు ఆదాయం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో తిరునాళ్ల వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయి. భక్తుల నుంచి లభించిన విశేష స్పందనతో పాటు ఆదాయం కూడా గణనీయంగా పెరగడం పట్ల దేవాదాయ శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ ఆదాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# నేటినుండి కొమురవెల్లిలో రైతు విత్తన మేళా

**-సద్వినియోగం చేసుకోవాలని అధికారుల విజ్ఞప్తి**

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడం, అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించడం లక్ష్యంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు రైతు విత్తన మేళా--2026 నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ విత్తన మేళాలో రైతులకు ధృవీకరించిన, నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు వెల్లడి ంచారు. ముఖ్యంగా కందులు, పెసర్లు, మినుములు, బొబ్బర్లు వంటి పప్పుధాన్యాల విత్తనాలతో పాటు ఆముదం వంటి నూనెగింజల పంటలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో నాసిరకం విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూలై 27, 29 తేదీల్లో కొమురవెల్లి రైతు వేదికలో, జూలై 28న మర్రిముస్తాయల రైతు వేదికలో ఉదయం 10 గంటల నుంచి విత్తన మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకొని మెరుగైన దిగుబడులు సాధించాలని




కోరారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ధృవీకరించిన విత్తనాలతో సాగు ప్రారంభించాలని సూచించారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొని రైతు విత్తన మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కొమురవెల్లి అభివృద్ధికి ఎంపీ చామల కీలక వినతి

**-'ప్రసాద్' పథకంలో మల్లన్న దేవస్థానాన్ని చేర్చాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

కొమురవెల్లి పుణ్యక్షేత్రం సమగ్ర అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆయన కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల ప్రారంభమైన కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వ 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో చేర్చి అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే తెలంగాణలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని 'ప్రసాద్ (PRASAD)' పథకంలో చేర్చి యాత్రికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో చేర్చడం ద్వారా స్టేషన్ ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు అత్యాధునిక వేచివుండే హాళ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, డిజిటల్ సమాచార వ్యవస్థ, మెరుగైన పార్కింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో మరిన్ని ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక రైళ్లు కొమురవెల్లిలో ఆగే అవకాశాలు పెరుగుతాయని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మల్లన్న భక్తులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. అదేవిధంగా, ప్రసాద్ పథకంలో కొమురవెల్లి దేవస్థానాన్ని చేర్చడం ద్వారా ఆలయ పరిసరాల్లో రహదారుల విస్తరణ, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, యాత్రికుల విశ్రాంతి గృహాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, సుందరీకరణ పనులు, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. దీంతో భక్తులకు మరింత సౌకర్యవంతమైన యాత్ర అనుభవం కలుగుతుందని పేర్కొన్నారు. కొమురవెల్లి ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక వ్యాపారులు,



హోటల్ రంగం, రవాణా రంగం, చిన్న వ్యాపారులు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎంపీ అభిప్రాయపడ్డారు. ఈ రెండు ప్రతిపాదనలు అమలైతే కొమురవెల్లి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందే అవకాశముందని అన్నారు. ఈ వినతిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో, మల్లన్న దేవస్థానాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని స్థానిక ప్రజలు, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మోదీ పాలనలో భారతీయ రైల్వేలకు స్వర్ణయుగం ప్రారంభమైంది: కేంద్ర మంత్రి బండి సంజయ్

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు నూతన శకంలోకి అడుగుపెట్టాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం రైల్వే రంగంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తెలంగాణకు కేటాయిస్తున్న నిధులు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు.

**-భక్తుల కల సాకారం**

కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు నేడు తెరపడిందని బండి సంజయ్ పేర్కొన్నారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఆలయ శైలిలో రూపుదిద్దుకోవడంతో భక్తులకు రైలు దిగిన క్షణం నుంచే ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుందన్నారు. ఈ స్టేషన్‌తో భక్తుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని, శివరాత్రి, మాఘమాస జాతరల సమయంలో లక్షలాది మంది యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

**-రైలు పట్టాలు అభివృద్ధికి ప్రతీక**

రైల్వే మార్గాలు కేవలం రవాణా కోసం మాత్రమే కాదని, అవి అభివృద్ధి, ఉపాధి, పర్యాటక రంగాల పురోగతికి నాంది పలుకుతాయని బండి సంజయ్ అన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్‌తో స్థానిక రైతులు, చిన్న వ్యాపారులు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని, ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

**-తెలంగాణకు భారీ రైల్వే కేటాయింపులు**

యూపీఏ ప్రభుత్వ హయాంలో 2014లో తెలంగాణకు కేవలం రూ.258 కోట్ల రైల్వే బడ్జెట్ మాత్రమే కేటాయించారని, ప్రస్తుతం మోదీ ప్రభుత్వంలో అది దాదాపు 20 రెట్లు పెరిగి ఈ ఏడాది రూ.5,454 కోట్లకు చేరిందని తెలిపారు. గత 12 ఏళ్లలో తెలంగాణలో రైల్వే అభివృద్ధి కోసం రూ.36,286 కోట్లు ఖర్చు చేశామని, ప్రస్తుతం రూ.47,984 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**-మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు**

దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుల్లో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యం దక్కిందని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్--పూణే హైస్పీడ్ రైల్ కారిడార్ల నిర్మాణానికి రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించామని చెప్పారు.

**-30 కొత్త రైల్వే ప్రాజెక్టులు**

తెలంగాణలో మరో 30 కొత్త రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే కొనసాగుతోందని, వీటి నిర్మాణానికి రూ.84,492 కోట్ల వ్యయం అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2, ఔటర్ రింగ్ రైల్, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులు కూడా అమలులోకి రానున్నాయని చెప్పారు.

స్టేషన్ల ఆధునీకరణకు ప్రాధాన్యం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్ల



అభివృద్ధి జరుగుతోందని, సికింద్రాబాద్, నాంపల్లి, చర్లపల్లి, బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్లు ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. కాజీపేటకు కొత్త గుర్తింపు రూ.521 కోట్లతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు తుది దశకు చేరుకున్నాయని, భవిష్యత్తులో అక్కడే నూతన తరం ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర--రాష్ట్ర సమన్వయం అవసరం తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో భారీ స్థాయిలో నిధులు కేటాయించిందని పేర్కొన్న బండి సంజయ్, కేంద్రంపై విమర్శలు చేయడం కంటే అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని సూచించారు. కేంద్రం విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. ప్రసంగం ముగింపులో, "రైల్వే ట్రాక్‌లు కేవలం రెండు పట్టాలు కాదు... అవి అభివృద్ధి, ఉపాధి, భక్తి, పర్యాటకం, ప్రగతిని కలిపే పట్టాలు" అని వ్యాఖ్యానించిన బండి సంజయ్, కొమురవెల్లి రైల్వే స్టేషన్ తెలంగాణ ఆధ్యాత్మిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర' గ్రంథావిష్కరణ

హిందుస్థాన్ మీడియా, వినుకొండ:

వినుకొండ ప్రాంత సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని భావితరాలకు పరిచయం చేసే ఉద్దేశంతో రూపొందించిన 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర' గ్రంథాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. వినుకొండ పట్టణంలోని లయోలా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, ఒక ప్రాంత చరిత్రను, సాహిత్య సంపదను, సంస్కృతిని పుస్తక రూపంలో భద్రపరచడం గొప్ప సేవ అని అన్నారు. వినుకొండ ప్రాంతానికి చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తల సేవలను ఒకే గ్రంథంలో పొందుపరచడం ద్వారా భావితరాలకు విలువైన సమాచారాన్ని అందించిన రచయితల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ గ్రంథం విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్యాభిమానులకు ఉపయోగకరమైన గ్రంథంగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, తెలుగు భాషా సాహిత్య వికాసానికి ఇటువంటి రచనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. అనంతరం గ్రంథ రచయిత రమేష్ దంపతులను దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్య క్రమంలో సాహితీవేత్తలు,





విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రచయితలు, సాహిత్యా భిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# మారుతి బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ వచ్చేసింది..

## కొత్త లుక్, 5-స్టార్ సేఫ్టీ, అదిరే ఫీచర్లతో ఎంట్రీ!

### భారత్‌లోకి మెర్సిడెస్ కొత్త హైబ్రిడ్ సెడాన్ లాంచ్..




ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్-బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్-ఇన్ హైబ్రిడ్ (ౠఎజుఎ) పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈ-క్లాస్ సెడాన్ అయిన 'మెర్సిడెస్-ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్ం'ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్-ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థ్యం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్-బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ.. "భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈ-క్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థ్యం వంటి అంశాలను ఒకేచోట అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుంది" అని వివరించారు.

**రూ.11 వేల టోకెన్ అమౌంట్‌తో బుకింగ్స్ ప్రారంభం**
**10.1 అంగుళాల టచ్‌స్క్రీన్, 360 డిగ్రీల కెమెరా**
**అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్**
**భారత ఎన్‌క్యాప్‌లో 5-స్టార్ రేటింగ్**
**పెట్రోల్, టర్బో, సీఎన్‌జీ ఇంజిన్ ఆప్షన్లు**

మారుతి సుజుకి భారత మార్కెట్లో కొత్త బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను అధికారికంగా విడుదల చేసింది. కొత్త డిజైన్, మరిన్ని ప్రీమియం ఫీచర్లు, మెరుగైన భద్రతా వ్యవస్థతో ఈ ఎస్‌యూవీని తీసుకొచ్చింది. బ్రెజ్జా LXI, VXI, ZXI, ZXI+ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. రూ.11,000 టోకెన్‌తో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డిజైన్ పరంగా ముందు భాగంలో కొత్త గ్రిల్, రీడిజైన్ చేసిన బంపర్, కొత్త ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, డీఆర్ఎల్స్ ఆకట్టుకుంటున్నాయి. కొత్త అలాయ్ వీల్స్‌తో పాటు వెనక భాగంలో టెయిల్ ల్యాంప్ డిజైన్‌ను కూడా మార్చారు. క్యాబిన్‌లో బ్లాక్-బ్రౌన్ డ్యూయల్ టోన్ థీమ్‌ను కొనసాగిస్తూ 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, అలెక్సా సపోర్ట్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, ఆటో క్లైమేట్ కంట్రోల్, 360 డిగ్రీ కెమెరా వంటి ప్రీమియం ఫీచర్లను జోడించారు. భద్రతకు కూడా కంపెనీ పెద్దపీట వేసింది. అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్, ఈఎస్‌పీ, హిల్ హోల్డ్ అసిస్ట్, ఏబీఎస్-ఈబీడీ, చైల్డ్ సీట్ మౌంట్స్, టీపీఎంఎస్, బ్లైండ్ స్పాట్ వార్నింగ్, రియర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, సేఫ్ ఎగ్జిట్ వార్నింగ్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సర్లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ కొత్త బ్రెజ్జాకు భారత్ ఎన్‌సీఏపీలో 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా లభించింది. ఇంజిన్ పరంగా 1.5-లీటర్ పెట్రోల్, 1.0-లీటర్ టర్బో పెట్రోల్, సీఎన్‌జీ అనే మూడు ఆప్షన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. పెట్రోల్ మోడళ్లకు 6-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు అందుబాటులో ఉంటాయి. సీఎన్‌జీ వేరియంట్‌కు మాన్యువల్ గేర్‌బాక్స్ మాత్రమే ఉంటుంది. ధరలు గత మోడల్‌తో పోలిస్తే కొద్దిగా పెరిగినా, అదనపు ఫీచర్లు, మెరుగైన భద్రత కారణంగా కొత్త బ్రెజ్జాపై మార్కెట్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.




# హార్దిక్ పాండ్యా కోసం చెన్నై భారీ ఆఫర్.. ముంబై ఇండియన్స్ మెగా డిమాండ్

## క్రీడలు

**ఐపీఎల్ 2027కు ముందు హార్దిక్‌ను దక్కించుకునేందుకు చెన్నై ప్రయత్నాలు**
**ఆయుశ్ మాత్రే, శివమ్ దూబేలను డిమాండ్ చేస్తున్న ముంబై ఇండియన్స్**
**మాత్రేను ఇచ్చేందుకు నిరాకరించి.. దూబే, బ్రెవిస్‌లను ఆఫర్ చేసిన చెన్నై**
**దూబే, బ్రెవిస్‌తో పాటు రూ.10 కోట్లు నగదు ఇచ్చేందుకు సీఎస్‌కే ప్రతిపాదన**
**చర్చలు విఫలమైతే రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్న కేకేఆర్**

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్‌ను వీడనున్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మెగా ట్రేడింగ్ వ్యవహారంలో రెండు ఫ్రాంచైజీల మధ్య ఆసక్తికరమైన బేరసారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హార్దిక్‌ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ భారీ ప్యాకేజీని డిమాండ్ చేస్తుండగా, చెన్నై అందుకు భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. 'హిందుస్థాన్ టైమ్స్' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు బదులుగా తమకు యువ సంచలనం ఆయుశ్ మాత్రేతో పాటు విధ్వంసకర ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఇవ్వాలని ముంబై ఇండియన్స్ కోరినట్లు సమాచారం. గత ఐపీఎల్ సీజన్‌లో దాదాపు 180 స్ట్రైక్ రేట్‌తో అదరగొట్టిన 19 ఏళ్ల మాత్రేను తమ జట్టు పునర్నిర్మాణంలో భాగంగా కీలక ఆటగాడిగా ముంబై భావిస్తోంది. అందుకే అతడిని ట్రేడింగ్‌లో చేర్చాలని పట్టుబడుతోంది. అయితే, భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతాడని భావిస్తున్న ఆయుష్ మాత్రేను వదులుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఎంతమాత్రం సుముఖంగా లేదు. అతడిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ముంబైకి మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రతిపాదించింది. ఈ కౌంటర్ ఆఫర్‌లో భాగంగా శివమ్ దూబే, దక్షిణాఫ్రికా డైనమిక్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌లతో పాటు అదనంగా రూ.10 కోట్ల నగదును ముంబైకి ఇచ్చేందుకు సీఎస్‌కే సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ముంబై ఇండియన్స్‌కు సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రయోజనం చేకూరవచ్చు. పేస్ బౌలింగ్ చేయగల భారత మిడిల్ ఆర్డర్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ చాలా అరుదైన ఆటగాడు. అయినప్పటికీ ఐపీఎల్ 2026లో అతను కేవలం 206 పరుగులు చేసి, 4 వికెట్లు మాత్రమే తీయడంతో అతని ఇటీవలి ఫామ్ ఆందోళన కలిగిస్తోంది.



# మూడో టీ20 కూడా మనదే... జింబాబ్వే పై టీమిండియా క్లీన్ స్వీప్

జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరె (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.



# ‘టాక్సిక్’ నుంచి యశ్ కొత్త లుక్.. కౌంట్‌డౌన్ పోస్టర్ అదిరింది!

‘కేజీఎఫ్’ సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రాకింగ్ స్టార్ యశ్, తన తదుపరి చిత్రం ‘టాక్సిక్’తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, చిత్ర బృందం యశ్ ఇంటెన్స్ లుక్‌తో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో యశ్ స్టైలిష్‌గా, అంతే క్రూరంగా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన చేతులతో, ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ ఇంటెన్స్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తున్నప్పటికీ, కథపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఉత్కంఠను పెంచుతోంది. “అతని చేతులకు రక్తం అంటింది” అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. ‘టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్’ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె ఈ కథను రాయడం విశేషం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో రూపొందించి, పలు భారతీయ భాషల్లోకి డబ్ చేయనున్నారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి వంటి భారీ తారాగణం నటిస్తోంది. కేజీఎఫ్ సిరీస్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ‘టాక్సిక్’పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.







## ‘ఆదర్శ కుటుంబం’ నుంచి కీలక అప్‌డేట్..

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47- ఏకే 47’ అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకీ పోషిస్తున్న పాత్ర పేరును మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆయన ‘చిట్టి బాబు’ అనే పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సోషల్ మీడియా ‘ఎక్స్’ వేదికగా ప్రకటించింది. రేపటి నుంచి సినిమాలోని ఒక్కో పాత్రను పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా వెంకటేశ్‌ను చిట్టి బాబుగా, హీరోయిన్ శ్రీనిధి శెట్టిని స్వర్ణగా, ఇతర నటులు యువీన పార్థవిని సంపూర్ణగా, రాజా ప్రజ్వల్‌ను సర్వగా పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఇటీవలే నటుడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన ఈ సినిమాలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేయగా, అందులో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గతంలో ‘వెంకీ77’గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. వెంకటేశ్ గత చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’ ఘన విజయం సాధించడం, దానికితోడు త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆయన మొదటిసారి పూర్తిస్థాయి హీరోగా నటిస్తుండటంతో ఈ సినిమాపై ఆసక్తి రెట్టింపయింది.

# తన మొదటి సినిమా వెనుక కథ చెప్పిన రకుల్



**కాలేజీలో ఉండగా వచ్చిన సినిమా ఆఫర్**
**కారు కొనాలనే ఉద్దేశంతోనే నటనకు ఓకే చెప్పానన్న రకుల్ ప్రీత్**
**చదువు పూర్తి చేశాకే ఇండస్ట్రీలోకి రీఎంట్రీ**
**ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా సొంతంగా ఎదిగానన్న రకుల్**

ప్రముఖ కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ తన సినీ ప్రస్థానం ప్రారంభమైన తీరు గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలపై మక్కువతో కాకుండా, కేవలం ఒక కారు కొనుక్కోవాలనే లక్ష్యంతోనే తాను నటిగా మారినట్లు ఆమె వెల్లడించారు. ఇటీవల జరిగిన ‘రైజింగ్ భారత్ సమ్మిట్’లో పాల్గొన్న రకుల్... తాను కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి అనుకోకుండా అవకాశం వచ్చిందని తెలిపారు. తన ఛాయాచిత్రాలను చూసిన కొందరు ప్రతినిధులు తన తండ్రిని సంప్రదించి, సినిమాలో నటించమని కోరారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తనకు సినిమాలపై పెద్దగా అవగాహన లేకపోయినప్పటికీ, వారు రూ.5 లక్షల పారితోషికం ఆఫర్ చేయడంతో వెంటనే అంగీకరించానని చెప్పారు. ఆ డబ్బుతో కారు కొనుగోలు చేసి, తన స్నేహితుల బృందంలో సొంతంగా కారు కొన్న మొదటి అమ్మాయిగా నిలవాలనేదే తన అప్పటి ఏకైక ఆశయమని రకుల్ చిరునవ్వుతో తెలిపారు. ఆ సినిమా కోసం సుమారు 40 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొన్నానని, ఆ సమయంలో కెమెరా ముందు నటించడం తనకు ఎంతో నచ్చిందని వివరించారు. అయితే, ముందుగా తన డిగ్రీ పూర్తి చేయాలని నిశ్చయించుకుని, ఆ తర్వాతే పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించానని ఆమె పేర్కొన్నారు. ఎటువంటి సినీ నేపథ్యం (గాడ్‌ఫాదర్) లేకుండా 2013లో తిరిగి వచ్చి, ఇక్కడి పరిస్థితులను స్వయంగా నేర్చుకున్నానని స్పష్టం చేశారు. ప్రారంభ దశలో చదువు కారణంగా కొన్ని భారీ ప్రాజెక్టులను కూడా వదులుకోవాల్సి వచ్చిందని రకుల్ తెలిపారు. రకుల్ 2009లో కన్నడ చిత్రం ‘గిల్లి’తో సినీ రంగప్రవేశం చేయగా, 2013లో విడుదలైన ‘వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్’తో తెలుగు ప్రేక్షకులకు పరిచయ మయ్యారు. ప్రస్తుతం ఆమె హిందీలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ‘రామాయణ’ చిత్రంలో శూర్పణఖ పాత్రలో కనిపించనున్నారు.

## పాట పాడిన సూర్య.. ‘విశ్వనాథ్ - సన్స్’ నుంచి ‘ది వెడ్డింగ్ సాంగ్’ విడుదల

విలక్షణ నటుడు సూర్య కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘విశ్వనాథ్ ౘ సన్స్’. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా తొలి పాటను విడుదల చేశారు. ‘ది వెడ్డింగ్ సాంగ్’ పేరుతో శనివారం విడుదలైన ఈ పాటకు జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, కెన్ కరుణాస్ సాహిత్యం సమకూర్చారు.ఈ పాటలోని ప్రధాన ఆకర్షణ ఏమిటంటే, హీరో సూర్య స్వయంగా దీనికి గాత్రాన్ని అందించడం. ఒక ఉమ్మడి కుటుంబంలో జరిగే వివాహ వేడుక నేపథ్యంలో చిత్రీకరించిన ఈ గీతంలో సూర్య, కథానాయిక మమితా బైజు తమ డ్యాన్స్‌తో సందడి చేశారు. హై-ఎనర్జీ ఫెస్టివ్ ట్రాక్‌గా రూపొందిన ఈ పాట సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా, ఈ పాటను సూర్య స్టూడియోలో రికార్డ్ చేస్తున్న ఫొటోలను గతంలోనే జీవీ ప్రకాష్ కుమార్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న విషయం తెలిసిందే. ‘విశ్వనాథ్ ౘ సన్స్’ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రంలో 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ ‘సంజయ్ విశ్వనాథ్’ పాత్రలో సూర్య కనిపించనున్నారు. పెరుగుతున్న వయసుతో సంబంధం లేకుండా తన లక్ష్యం కోసం పోరాడే ఒక వ్యక్తి కథాంశంతో సాగే ఈ పాత్ర ఎంతో భావోద్వేగభరితంగా ఉండనుంది. సూర్య సరసన మమితా బైజు కథానాయికగా నటిస్తుండగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.






Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455